

# రావణుడితో లవ్ ఎఫైర్

*బి. లలిత*

మదరాసు నగరంలో మండు వేసవి కాలంలో మూడున్నర గంటలకి మొదలయింది – ఈ కథ ...... మైథిలి పిల్లి పాలు తాగేసినందున మధ్యాహ్నం పాలు తేవడానికి పాలడిపోకి బయలుదేరింది. సెలవలకి పిన్ని బాబాయిలతో వుండడానికి వచ్చింది. ఊరు కొత్త. భాష రాదు. అయినా ఎలాగో ఒకలాగ మానేజ్ చేసేయచ్చు అనుకుంది నడుస్తూ.

పిన్ని నేర్పించిన "రెండళాకు పాలు వేణుం" అన్నదాన్ని డిపోవాడికి అప్ప చెప్పి పాలూ చిల్లర పుచ్చుకొని వెనక్కి తిరిగింది. మా ఊరులోలాగే వుంది యిక్కడ కూడా ఎండ అనుకుంది.

సందు మలుపు తిరిగింది. అప్పుడు జరిగింది......

మైథిలి ఊళ్ళో పేవ్‌మెంట్లుండవు. రోడ్డుమీదే నడుస్తారు-జనం. అదే అలవాటు ప్రకారం పేవ్‌మెంటు పక్కనే నడుస్తోంది మైథిలి. రాంగ్ సైడులో జామ్మని చప్పుడు చేసుకుంటూ ఒక అబ్బాయి మోటార్‌సైకిల్‌తో మైథిలి ఎదురుగా వచ్చాడు. ఉలికిపడి, భయపడిన మైథిలి పాలగిన్నె వదిలేసింది. వేసుకున్న మాక్సీ నిండా పాలు పడ్డాయి. అడుగు తడబడి, పేవ్‌మెంట్ మీద చతికిలబడింది మైథిలి. ఆ అబ్బాయి తన వాహనాన్ని నించోపెట్టి వచ్చి చెయ్యందించి లేవదీశాడు. పాలగిన్నె తీసుకొని మైథిలిని మళ్ళీ పాల డిపో వైపు నడిపించాడు. డిపోవాడితో అనర్గళంగా అరవంలో మాట్లాడి, మళ్ళీ పాలు తీసుకొని, డబ్బులిచ్చాడు.

మైథిలి యిదంతా విస్తుబోతూ చూసింది. అతను తనవైపు తిరగనిచ్చి నోరువిప్పింది... కాని మాట్లాడ నివ్వకుండా ఆ అబ్బాయి 'నాదే తప్పులెండి, రాంగ్ సైడులో వచ్చాను. అయినా మీలాంటివాళ్ళు రోడ్డుని పావనం చేస్తారని ఊహించకపోవడం చాలా పెద్ద తప్పు,' అన్నాడు యింగ్లీషులో. మైథిలి అది పొగడ్తో వెక్కిరింపో తెలియక, ఏమనాలో పాలుపోక ఊరుకుంది. తన మోటార్‌సైకిల్ దగ్గర వరకూ మైథిలితోపాటు నడిచి, దాన్ని ఒక కిక్‌తో స్టార్ట్ చేసి. బైక్ మీద మాయమయిపోయాడు. మైథిలి ఆలోచిస్తూ యింటికి నడిచింది.

ఆ సాయంత్రం ఆ చుట్టుపక్కల యిళ్ళలో మైథిలి వయసు అమ్మాయిలందరికీ ఈ విషయం తెలిసిపోయి, పరామర్శకి వచ్చారు. వాళ్ళలో నలుగు రయిదుగురు తెలుగు పిల్లలే.

సుమతి అంది... "మన వీధిలో, మోటారుబైకున్న అబ్బాయిలు యిద్దరే-అనిల్‌ధవాన్. రావణుడు. ఎవరంటావు-ఈ హెల్పు చేసినది?"

అంబిక కళ్ళు చిట్లించింది. "రావణుడు అమ్మాయిలని కళ్ళతో కొరుక్కుతినడం తప్ప హెల్ప్ చేస్తాడా? అనిల్ ధవాన్ అయుండాలి," అంది.

మీనాక్షి నిట్టూర్చింది. (ఆమెకి కలల్లో అనిల్ ధవాన్ వస్తూంటాడు మరి) "ఎలాగున్నాడో చెప్పు- ఎవరో తేల్చచ్చు." అంది! మైథిలి గొంతుసవరించుకుంది. పొడుగ్గా, ఎథ్లెటిక్‌గా వున్నాడు. భారీగా కనిపిస్తాడు. ఎల్లో బెల్‌బాటమ్స్ వేసుకున్నాడు. పైన టై అండ్ డై పుల్లోవరు వేసుకున్నాడు. మీసాలున్నాయి. గాగుల్స్. శత్రుఘ్నసిన్హాలాగున్నాడు. పాలు కొంటున్నపుడు గాగుల్స్ తీసేసాడు. కళ్ళు చాలా సన్నంగా, సెక్సీగాబవున్నాయి...కళ్ళతో

మనుషుల్ని నమిలి మింగేయగలట్టు చూస్తాడు. కంఠం చాలా బాగుంది..."

"ఇంకేం... రావణుడే," అంది మీ నాక్షి ఆనందంగా. "రావణుడేమిటి? అప్పట్నుంచి వింటున్నాను... ఒక్కరూ కొంచెం వివరంగా చెప్పరు...?" కొంచెం అలిగినట్టు నటించింది మైథిలి. అందరమ్మాయిలూ కలిసి చెప్పారు.

"రావణుడు చాలా చెడ్డవాడు. అమ్మాయిలవెంట తిరుగుతాడు. అతనితో కనిపించిన అమ్మాయికి ఆ చుట్టుపక్కల వీధుల్లో ఎక్కడా బాయ్‌ఫ్రెండ్సు దొరకరు. అతనికి అబ్బాయిందరూ స్నేహితులే. కాని అమ్మాయిలందరూ అతన్ని చూసి భయపడతారు. మల్లిగైని అతను ఛాలెంజికోసం రోడ్డుమీద ముద్దుపెట్టుకున్నప్పట్నించి అతనితో మాట్లాడడం అబ్బాయిలకి గౌరవం గానూ- అమ్మాయిలకి అప్రతిష్టగానూ చలామణి అవుతోంది. రావణుడి కంట బడిన అమ్మాయిలు వరసగా, రావణుడికి తమ మీద మోజు తీరేంతవరకు రాళ్ళ వర్షాలు, రాకెట్లూ, ప్రేమ లేఖలు, రోడ్డు మీదడాష్‌లూ అనుభవించి తీరతారు..."

ఈ ఇన్‌ఫర్‌మేషన్ విని మైథిలి ఆశ్చర్యపోయింది. చూడడానికి అలాగ కనిపించలేదు రావణుడు. చాలా మర్యాదగా కన్పించాడు. అఫ్‌కోర్సు; అతని మాటలు - రూడ్‌గా వున్నట్టు న్నాయి... వాటిగురించి అమ్మాయిలకి చెప్పలేదు- మైథిలి.

"అయితే రావణుడని ఎందుకు పేరు పెట్టారు. యింకే పేరూ దొరకలేదా?" అంది మైథిలి. అమ్మాయిలందరూ ఒకే సారి మూకుమ్మడిగా ఆశ్చర్యపోయారు. "అంత పోకిరి వెధవకి యింకే పేరు పెడతారు? రావణాసురుడి అవతారమే వాడు."... వగైరా వగైరా అన్నారు.

మైథిలి ఏమీ మాట్లాడలేదు. టాపిక్ మార్చేసింది. కాని, రాత్రి భోజనాల పుడు అంది పిన్నితో "ఆ అబ్బాయిని పాపం రావణుడంటారట" అని. బాబాయి కొడుకు, మైథిలికంటే పెద్దవాడు అయిన వేణు కుతూహలం చూపించాడు. "రావణుడి గురించి నీకెలా తెలుసు?" అంటూ. మైథిలి చెప్పింది.

వేణు రావణుడి కేరక్టరులో యింకో కోణం తెలిసినవాడు. రావణుడూ వేణూ స్నేహితులు "మిగతావాళ్ళు చాలెంజ్ చేస్తే దానికోసం అల్లరిచేస్తాడు. రౌడీలా వుంటాడు. కాని చాలా మంచి వాడు రావణుడు. తానంతట తాను అమ్మాయిల జోలికి పోడు" అన్నాడు వేణు... అవుననుకుంది మైథిలి.

"తనకి వచ్చిన పేరు గురించి చాలా ఫీలవుతాడు. అమ్మాయిలెవరూ తనతో మామూలుగా మాట్లాడరని కొంచెం బాధ. అందరితో సరదాగా వుంటాడు..." హఠాత్తుగా మైథిలికి రావణుడన్నమాటల

అర్థం తెలిసింది. తనకీ అతని పేరు గురించి తెలుసుకోవాలనుకుని అలాగ వ్యంగ్యంగా అన్నాడు! పాపం అను కుంది. అదే పైకి అంది.

"నా మటుకు నాకు రామాయణంలో రావణుడే యిష్టం. కొంచెం మేన్లీగా వుంటాడు. తనకి కావల్సిన అమ్మాయిని ధైర్యంగా తీసుకుని పోగలడు. రాముడూ వున్నాడు - ఎందుకూ పనికిరాడు-సిస్సీ పెళ్ళాంకోసం ఏడుస్తాడు అంతే" అంది మైథిలి.

వేణు గాభరాగా అన్నాడు" తల్లి తల్లి-అలా అనకే - అసలేనువ్వు సీతమ్మవారి పేరింటికత్తెవి - పైన ఆవిడా రాముడూ యీ మాటలు విన్నారంటే నన్ను రౌరవాది నరకాలో ఏవో - వాటిలో కాగుతున్న నూనెలో పడేసి, వేయించుకు తింటారు..."

"పోరా - రావణుడెంత గొప్పవాడో నీకేం తెలుసును? రాముడికే అనుభ వించే ధైర్యంలేక దానికి ఏకపత్నీవ్రతం అని పేరు పెట్టుకుని... ఐ లవ్ రావ ణుడూ తెల్సా - ఎంత ధైర్యం - ఎంత డేర్ డెవిల్ నేచర్!... రాముడు సీతా సీతా అని ఏడుస్తాడంతే - చేతకాని తనాన్ని సహనం, ఓర్పు గాడిదగుడ్డూ అని..."

మైథిలి యింకా ఏదో చెప్పబోయేం తలో పిన్ని కోప్పడింది. "చాల్చాల్లే-దేవుణ్ణి తిట్టేంత గొప్పదానివయావ్." అంటూ.

* * *

ఆ మర్నాడు — వేణు పొద్దుటే షికా రుకి బయల్దేరాడు, మైథిలి రాత్రంతా తన మనసులో తిరుగుతున్న దాన్ని అమలుపెట్టడానికే నిశ్చయించుకుంది... "వేణూ, మీ రావణుడితో కలిసివెళ్తావా?" అనడిగింది.

"ఏం - నీకు రావణుడంటే యిష్టం అని చెప్పాలా?" హాస్యంగా అడిగాడు వేణు." అదికాదురా - నిన్న పాలకి రావణుడికి డబ్బులివ్వాలి. అదికాక నేను థాంక్స్ చెప్పలేదు నిన్న..."

"చాల్లేవే - డబ్బులిచ్చి థాంక్స్‌చెప్తే, నువ్వతన్ని యీ వీధి పిల్లలందరి లాగా అవమానిస్తున్నావనుకుంటాడు." నిన్న నువ్వన్నట్టు - రావణుడిమీద నీకు జాలి, వగైరా ఏమైనావుంటే - అలాంటి పనేం చెయ్యకు." అన్నాడు వేణు. తర్వాత అన్నాడు. "సాయంత్రం షాపింగ్‌కి రా నీకు చీర కొనిపెడతాను" అని.

సాయంత్రం అలా బజారంట తిరిగి కావల్సినవి అక్కర్లేనివి - ముందే కొనా లనుకున్నవి - అప్పటికపుడు కొన్నవి-గంపెడుసామాను చేరేసుకుని, యింటికి నడక సాగించారు వేణూ మైథిలీ. "వేణూ చాలా బరువుగా వున్నాయిరా యీ బేస్కెట్లు." అంది మైథిలి ఆయాస పడుతూ. వేణు మైథిలి బుట్టలోంచి మరి



కొన్ని పాకెట్లు తీసుకోబోయాడు. తన చేతుల్లోనివి బాలెన్సుతప్పి క్రిందపడ్డాయి. వంగి తీయబోయి మైథిలి తన బేస్కెట్లూ కింద పడేసింది. అన్నీ కలిపి ఏరడం మొదలెట్టారు తిట్టుకుంటూ. "కెన్ ఐ హెల్ప్ యూ!" అంటూ, పుష్పక విమానం లాంటి తన మోటార్‌బైక్‌తో ప్రత్యక్షమయాడు రావణుడు.

వేణు ఆనందపడిపోయాడు. "రారా, సమయాని కొచ్చావు. ఈ ఆడవాళ్ళతో షాపింగ్ కెళ్తే చూడు - ఎన్ని బుట్టల సామానులో..." అంటూ ఆహ్వానించాడు. పాకెట్లు ఏరిపెట్టి, తన బైక్‌మీద పడేసాడు రావణుడు. "ఇద్దరం కలిసి వెళ్దాం" అన్నాడు. తర్వాత మైథిలిని చూసి వేణుకేసి ప్రశ్నార్థకంగా చూశాడు.

వేణు పరిచయం చేసాడు - "నా కజిన్ - వెకేషన్‌కి వచ్చింది, పేరు మైథిలి." అని "నేను రావణుడిని!"

అన్నాడు, రావణుడు. ఆ కంఠంలో ఈ అమ్మాయీ అందర్లా తనని చూసి భయ పడేదే, అసహ్యించుకునేదే అయుంటుంది అన్న ఊహ వినబడింది, మైథిలికి.

ఇంటిగేటు తెరుస్తుంటే ఎదురింటి మీనాక్షి తమకేసి వెర్రిచూపులు చూడటం కన్పించింది మైథిలికి. రావణుడి గురించి మీనా ఏమనుకుంటుందో అనిపించింది. రావణుడు సామాన్లు లోపలపెట్టి వెళ్ళి పోతూ మీనాక్షిని చూసి. గాలిలో ముద్దు విసిరాడు. మీనాక్షి మొహం ఎర్రచేసు కుని లోపలకి వెళ్ళిపోయింది.

ఈ సంఘటనని వేణుతోపాటు చూసిన మైథిలి రావణుడంటే జాలిపడింది. లోప లికి నడుస్తూ వేణు సంజాయిషీ యిచ్చు కున్నాడు. "వాడలాగ బిహేవ్ చెయ్యా లని ఎదురుచూస్తారు అందరూ - అందుకే అలా తిరుగుతాడు - వాడు." అని. "నాకు తెలుసురా. ఒకవేళ రావణుడలా ఫ్లైయింగ్ కిస్ విసరకపోయినా - విసిరా డనే మీనాక్షి అందరితో చెప్తుంది. ఎవ రికి మటుకు వాళ్ళకే రావణుడు తమకేసి చూశాడంటే గొప్ప.కాని అతనితో మిగతా అబ్బాయిలతోలా మాట్లాడడానికి భయం. అంతా హిపోక్రసీ," అంది మైథిలి తనలో తాను అనుకుంటున్నట్టు.

వేణు మైథిలికేసి చాలా ఆశ్చర్యంగా చూశాడు. ఎంత మెత్తనిమనసు - ఎంత చక్కగా పరిస్థితులను అర్థం చేసుకో గలదు ! అనుకున్నాడు.

"మైథిలీ, నీకు కాలేజిలో బాయ్ ఫ్రెండ్సుండేవారా ?" అడిగాడు కుతూ హలంగా. మైథిలి తలూపింది, "మా కాలేజి అబ్బాయిలు చాలా మంచివాళ్ళు. సరదాగా మాట్లాడుకుంటాం అంతే - పెద్ద ఒకే అబ్బాయితో తిరగడం డేటింగ్ లాంటివి లేవనుకో" అంది.

*　　*　　*

ఆ మర్నాడు వేణు మధ్యాహ్నం భోజనానికి రాలేదు. 'రావణుడి యింట్లో పార్టీ' అని ముందే చెప్పివుంచాడు. పార్టీ అయాక వేణు రావణుడితో మైథిలి రావ ణుడి గురించి అన్నమాటలు, ఆమె భావాలు చెప్పాడు. రావణుడు నమ్మలేదు. సరికదా - "ఏవిటి-ఏదైనా ప్లాన్ వేస్తు న్నావా" అనడిగాడు వెటకారంగా. వేణు బాధపడ్డాడు. "నాకే ప్లానూ లేదురా రావణా. మైథిలిని మటుకు అలా అనకు. అది తోచినది పైకి చెప్పేస్తుంది. మంచి పిల్ల" అన్నాడు.

రావణుడు సిగరెట్టు వెలిగించి వేణు కేసి కొంచెం గంభీరంగా చూశాడు. "వేణూ, నేను సాడిస్టుని అవుతున్నా నను కుంటాను. ఎలాగా అంటారు కదా. అని అందరిచేతా చీదరించుకోబడే పనులు సరదాకి చేస్తున్నాను. కాని, వేణూ! ఇలా ఎన్నాళ్ళురా ? నాకు కొంచెం మనసువిప్పి మాట్లాడుకునే ఛాన్సు నీ దగ్గిరే దొరుకు తుంది. యీ కుర్రాళ్ళంతా నన్ను ఒక హీమాన్‌కింద, డేర్ డెవిల్ కింద చూస్తారు.

అమ్మాయిలు పులిని చూసినట్టు భయపడతారు. అలవాటయిపోతోంది అనుకో, కాని, అమ్మాయిలందరూ కూడా. నేను వాళ్ళని గమనించాలన్న ఆశ పెట్టుకుంటారోయ్. నేను కన్ను కొట్టాననుకో, పైకి కోపం నటిస్తారు. లోపలమటుకు, నేనెంత ఆకర్షణీయంగా లేకపోతే యిలా నా వెనక పడతాడు ... అనుకుకుంటారు ... ఎవరైనా మీ మైథిలి లాగా అనుకునే వాళ్ళున్నారంటే అపనమ్మకం పుడుతోంది..." రావణుడు కాస్సేపు ఆగిపోయాడు. తర్వాత హాస్యంగా అన్నాడు. "వేణూ నాకు మీ మైథిలితో మాట్లాడాలని వుంది. కాని, ఆమె సీత, నేను రావణుడిని. కుదరదు. అదికాక, మిగతా అమ్మాయిలు జెలసీతో కాల్చుకు తింటారు మీ కజిన్‌ని, ఏదో కొన్నాళ్ళుండి పోయే అమ్మాయిని బాధపెట్టడం దేనికి..."

కాని రావణుడికి దివ్యదృష్టి వుంటే అపుడే మైథిలిని మిగతా అమ్మాయిలు జెలసీతో ఏడిపిస్తున్నారని తెలిసివుండేది.. మీనాక్షి, అదే క్షణంలో అంటోంది. "ఎంత పొగరు వాడికి... నన్ను చూసి అలా ముద్దు విసురుతాడా, నువ్వు అలాంటివాడితో తిరగడమేమీ బాలేదు మైథిలీ"అని.

మైథిలి అస్పష్టంగా నవ్వుతూ వింటోంది. వీళ్ళకెంత జెలసీ, ముసుగు వేసుకున్నారు... అనుకుంది. అంబిక ఖచ్చితంగా అంది "మైథిలీ, నువ్వు అతనితో యింకొకసారి కనిపిస్తే, మేము నీతో మాట్లాడం, అతనితో కలిసి కనిపించడం నీ పరువును తీస్తుందని నువ్వు గ్రహించవేం...?"

మైథిలి ఓర్పు అక్కడితో అయిపోయింది. విసుగ్గా లేచినిలబడింది. "అమ్మాయిలూ! నేనతనితో కలిసి వెళ్ళలేదు. వేణుతో వెళ్ళాను. వేణు స్నేహితుడు కాబట్టి, మాకు దారిమధ్యలో కనపడితే, మాతోబాటు రమ్మన్నాం. అతను మీరు చిత్రించేంత చెడ్డగా ఏం ప్రవర్తించలేదు. సరికదా, నావంక చూడనుకూడా లేదు. నాకు నిద్రొస్తోంది. మీరు యింక వెళ్ళండి." అంది.

మైథిలి చివరి మాటలు వినిపించుకోనట్లు సుమతి అంది- "మైథిలీ- అంత వెకిలి మనిషితో నువ్వు తిరగడమే కాక అతన్ని సమర్థించుతూ మమ్మల్ని యిలా అవమానిస్తున్నావు..."

"ఆఁ- అతను వెకిలి మనిషే అయితే మొన్న మనం గుడికి వెళ్ళివస్తుంటే సైకిలుతో డష్‌యిచ్చి పళ్ళు, పువ్వులు కింద పడితే హిహిహి అని యికిలించిన మీ బాయ్‌ఫ్రెండ్సు యింకా వెకిలిమనుషులు- రావణుడికి కనీసం హెల్పింగ్ నేచరుంది- మీ అభిమానం లేక పోయినంతమాత్రాన ఏమీ కొరత లేదతనికి.

"అయినా అతనంటే అసహ్యమంటూ- ఎపుడు కలుసుకున్నా అతని గురించే మాట్లాడుతూ-అతను మిమ్మల్ని

కవ్వించడం మహా భాగ్యమని మనసులో అనుకుంటూ, తిరిగే మీకు-అతనితో మామూలుగా మాట్లాడగలిగే అవకాశంకలిగింది కాబట్టి నేనంటే యింత జలసీ... యింత హిపోక్రసీ నేనెక్కడా చూడలేదు... ముసుగులో గుద్దులాట-గుమ్మడికాయల దొంగలంటే భుజాలు తడుముకునే రకాలు-మీరు, అతన్ని అంత అసహ్యంగా చిత్రించి అలా తయారు. చేసినదీ మీరు. మీ అంత స్మాల్ మైండెడ్ మనుషుల హితబోధలూ బెదిరింపులూ నాకు అవసరం లేవు. "మైథిలి ఊపిరి తీసుకునేందుకు ఆగింది." మైథిలి... అని ఏదో చెప్పబోయిన అంబికని ఆపుతూ అంది- "నాకు తెలుసు- నాతో మాట్లాడరు. నన్నూ రావణుడిలాగే బాయ్‌కాట్ చేస్తారు. నావెనకాతల నా గురించి అసహ్యంగా మాట్లాడతారు. అంతేగా... మీలాంటివాళ్ళ స్నేహం నాకక్కర్లేదు మీరు వెళ్ళచ్చును."

అమ్మాయిలందరూ కోపంగా లేచి నిలబడ్డారు అందరి తరఫునా సుమతి అంది... "మైథిలీ- నువ్వు రెండు రోజులుండి పోయేదానివి. మీ పిన్ని బాబాయిల పరువు తియ్యకు-రావణుడితో తిరగకు..." అని.

మైథిలి విసురుగా అనేసింది: "మీ లాంటి డబుల్‌మైండెడ్ వాళ్ళని బయట పెట్టినంత మాత్రాన, మంచి మనుషులను సమర్థించినంత మాత్రాన పోయే పరువు మా పిన్ని బాబాయిలకు అక్కరలేనే లేదు. నా ప్రవర్తన గురించి మీ సలహా లనవసరం!" యీ మాటలని, విసురుగా లోపలికి వెళ్ళిపోయింది మైథిలి.

ఓ నాలుగు రోజులు మైథిలి ప్రవర్తన గురించి అట్టుడికిపోయింది ఆ కాలనీ. మైథిలిని ఆ చుట్టు ప్రక్కల యిళ్ళ అమ్మాయిలందరూ వెలి వేసినట్టు ప్రవర్తించడం మొదలెట్టారు. అబ్బాయిలూ "రావణుడి స్వీటు హార్ట్ వెడుతోంది..." అని కామెంట్ చెయ్యసాగారు మైథిలి ఇల్లు దాటితే.

రావణుడు యీ విషయాలన్నీ తెలుసుకొని ఆశ్చర్యపోయాడు. మైథిలి తనని సపోర్టుచేస్తూ అన్న ప్రతి మాటా తూచా తప్పకుండా తెలిసింది రావణుడికి. తను రోడ్డుమీద కన్పిస్తే కుర్రాళ్ళంతా "ఎంతదాక వచ్చింది ఎఫైరు?" అనడ గడం అలవాటయిపోయింది. వేణు ఈ రూమర్సని అపార్థం వేసుకోనందుకు సంతోషించాడు. ఎప్పటి లాగే సాయంత్రాలు వేణు యింటికి రాకపోకలూ తన దృష్టిని ఆకట్టుకుందుకు ప్రయత్నిస్తున్న అమ్మాయిలని కవ్వించడమూ జరప సాగాడు.

అయిదో రోజు యింకేమీ తోచక మైథిలి లైబ్రరీకి వెళ్ళింది. అక్కడ అనుకోకుండా రావణుడు కన్పించేసరికి కొంచెం గాభరాపడి, చేతికందిన పుస్తకాలేవో తీసుకుని బయటకి వచ్చేసింది.

రావణుడ్నీ, మైథిలినీ కుతూహలంగా, పరీక్షగా చూశారు లైబ్రరీలో వున్న జనం.

బయట రోడ్డుమీద మైథిలిని కలుసుకుందుకు త్వరత్వరగా నడిచాడు రావణుడు. "నన్ను సపోర్టుజేస్తూ మాట్లాడితే ఎన్ని రూమర్లు వస్తాయో తెలిసిందిగా అలా మాట్లాడడంతో మీరు చాలా తప్పుచేశారు. మీ అభిప్రాయాలు మనసులోనే వుంచుకుంటే యింత జరిగి వుండకపోవును. అయినా నాగురించి మీకంత మంచి అభిప్రాయం వున్నందుకు థాంక్స్. మీకీ కష్టం కలిగినందుకు నేనే కారణం, నన్ను క్షమించండి." అన్నాడు. మైథిలి తలవిదిలించింది. "అలాఏమీ లేదు. మీరు అలా అనుకుని బాధపడకండి. ఎవరేమనుకున్నా నాకు పోయేదేమీ లేదు," అంది.

తన ఇంటి సందులోకి తిరుగుతూ రావణుడికి చెయ్యూపింది. రావణుడూ చెయ్యూపాడు. ఇంట్లోకి వెళ్ళాక వేణుతో అంది. "రావణుడు కన్పించాడురా వేణూ సారీ, చెప్పాడు" అని.

"వేణూ, మనం సాయంత్రం సినిమాకి వెళ్తున్నాం గదా. రావణుడిని రమ్మను. కలిసివెళ్దాం" అంది మైథిలి. వేణు "మనమసలు సినిమాకెళ్ళటం లేదే ఈ సాయంత్రం." అన్నాడు. మైథిలి కోపం తెచ్చుకొంది. "అదేం. పొద్దుటే నాతో సినిమా కెళ్దామన్నదెవరు? ఇపుడు అర్జెంటుగా ఎందుకు కాన్సిల్ చెయ్యాలి?" అంటూ వేణు సినిమాకి వెళ్ళమంటే వెళ్ళమన్నాడు. మైథిలి కోపంగా అంది. "ఏం నీ గర్ల్‌ఫ్రెండు సడన్‌గా ఫోనుచేసి సినిమా కెళ్దామందా. నన్ను వదిలేసి పోదామనుకుంటున్నావా? అదేంకుదరదు. రెండు రోజులుండి పోయేదాన్ని ఆ గర్ల్ ఫ్రెండు ఎపుడూ వుండేదే. నన్ను సినిమాకి తీసికెళ్ళాల్సిందే." మైథిలి అన్నది నిజమే కాబట్టి వేణు ఎర్ర బడిపోయి. "ఏం రావణుడితో సినిమా కెళ్ళడం మీద నీకేమిటంత యింట్రస్టు?" అన్నాడు.

మైథిలి సీరియస్ అయిపోయింది. "రావణుడంటే నాకు చాలా గౌరవంరా. నాకతను చాలా నచ్చాడు. అతనిగురించి యింకా బాగా తెలుసుకుందామని" అంది. వేణు యిరుకున పడ్డాడు. మైథిలి తన భావం సూటిగా చెప్పేసింది. తను మటుకు చెప్పటం కష్టం.

"సర్లే, నేను రావణుడి యింటికి వెళ్తాను. అతనొస్తాడేమో కనుక్కున్నాక మన ప్రోగ్రాము మార్చాలో అక్కర్లేదో చూద్దాం." అన్నాడు.

* * *

సంగతి విన్న రావణుడు నవ్వాడు. "అందరం కలిసి బీచికి పోదాం. నువ్వు మధ్యలో నీగర్ల్‌ఫ్రెండుకోసం వెళ్ళినా పర్వాలేదు. మైథిలికి నేను కంపెనీగా వుంటాను. లేదా, నేను మీ యింటికి రాగానే అర్జంటు పని పేర్న నువ్వు ముందరేవెళ్ళిపోయినాఅభ్యంతరంలేదు." అన్నాడు.

వేణు థాంక్స్ చెప్పి "మైథిలికి నువ్వంటే చాలా గౌరవం రా, నాతో చెప్పింది" అన్నాడు, రావణుడు మనసులో ఆనందపడ్డాడు. పైకి "పోరా, నన్ను చూసి అమ్మాయిలు జడుసుకుంటారు కాని నన్ను గౌరవించరు" అన్నాడు.

వేణు మైథిలితో అనేశాడు." రావణుడూ నువ్వూ వెళ్ళండి బీచికి. నేను నా గర్ల్‌ఫ్రెండ్‌తో సినిమాకి పోతాను," అని. మైథిలి తలూపింది. రావణుడేమన్నాడో సూటిగా అడగలేకపోయింది మైథిలి.

మోటార్‌బైక్ చప్పుడు, గేటు తీసిన చప్పుడూ విని లేచి హాల్లోకి నడిచింది. మైథిలి. రావణుడు, తాము మొదటిసారి కలుసుకున్నప్పుడు వేసుకున్న బెల్ బాటమ్స్‌లో ప్రత్యక్షమయ్యాడు, చిరునవ్వుతో.

మైథిలి చెప్పింది, "వేణు సినిమాకి పోయాడు. మనిద్దరిని బీచికి వెళ్ళమన్నాడు." రావణుడు తలూపాడు "నేను బాబాయికీ పిన్నికి చెప్పివస్తాను." అంది మైథిలి.

బయటికి నడుస్తూవుండగా అడిగాడు రావణుడు "మైథిలీ, అనుకునే రూమర్స్ ఎలాగా అనుకుంటారు, వాటిని నిజం చేస్తే ఏం పోయిందన్న ఊహతో కాదుగా నువ్వురాడం?" మైథిలి తల అడ్డంగా ఊపింది. "మిమ్మల్ని యింకా బాగా తెలుసుకుందాం, స్నేహితులుగా వుందామనే ఊహతోనే. నేను యిప్పుడు మీతో బీచికి వస్తున్నాను" అంది.

"నాకు వచ్చిన పేరుమటుకు మారదు, నేను రావణుడ్ని, తెలుసుగా?"

మైథిలి నవ్వింది "నేను మండోదరి ననుకోండి పోనీ." అంటూ.

రావణుడూ నవ్వాడు. "అయితేనువ్విక్కడ వున్నన్నాళ్ళూ నాతో ఫ్రెండ్లీగా వుంటావన్నమాట, మద్రాసంతా చూపిస్తాను నీకు. సరేనా" అన్నాడు మోటార్ బైక్‌ని ఒక కిక్‌తో స్టార్టుచేస్తూ.

మైథిలి చురుగ్గా అంది. 'అయితే-నేను మాఊరు వెళ్ళిపోయాక మీరు నాతో కమ్యూనికేషన్ కీప్ అప్ చెయ్యరన్న మాట!"

రావణుడు పత్రికాయలంతేసి కళ్ళు పెట్టుకుని చూస్తున్న మీనాక్షికి చెయ్యూపాడు "నాకు వుత్తరాలురాయడం బాగా రాదు మండోదరీ" అన్నాడు.

బాలన్సుకోసం రావణుడి నడుంచుట్టూ చేతులువేసి మైథిలి "పర్వాలేదు ట్రంక్ కాల్ చెయ్యవచ్చును దశకంఠ మహాశయా!" అంది.

రావణుడు నవ్వి, ఎదురుగాలిలో మైథిలికి తనమాటలు వినిపించడం కోసం గట్టిగా అన్నాడు "మండోదరీ, మనది చాలా కాస్ట్లీ లవ్ ఎఫైర్ అయ్యేలాగుందే!" అని.

దానికి జవాబుతోచక ఆనందంగా రావణుడి భుజంమీద తల వాల్చింది మైథిలి అపుడు తోచిందామెకి, రావణుడి అసలు పేరు తనకింతవరకూ తెలియదని!

—